నియోజకవర్గానికి జగనన్న వరాలు

- డిగ్రీ కళాశాల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్
- దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించాలని పిలుపు

సామర్లకోట: నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. సామర్లకోట పర్యటనలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముందుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దాపురం మండలం కాండ్రకోట–తూర్పుపాకల బ్రిడ్జి మరమ్మతులకు రూ.4 కోట్లు, కాండ్రకోటలో అభివృద్ధి పనులకు మరో రూ.ఆరు కోట్లు మంజూరు చేస్తామన్నారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా మార్చడానికి రూ.18 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నా తమ్ముడు లాంటి దొరబాబును ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 52 నెలల పాటు ముఖ్యమంత్రిగా నేను రాష్ట్ర కోసం తపించిన విధంగా నియోజకవర్గం కోసం దొరబాబు తపించారన్నారు. నాయకుడు అంటే ఈ విధంగా ఉండవచ్చు అని నిరూపించారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.



మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు తదితరులు

సీఎం సభకు తరలివెళ్లిన ప్రజలు

పిఠాపురం: సామర్లకోటలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు మహిళలు భారీగా వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలు జెండా ఊపి బస్సులు, వాహనాలను ప్రారంభించారు. జగనన్న కాలనీలకు చెందిన లబ్ధిదారులు సీఎం సభకు వెళ్లేందుకు ఉత్సాహం చూపించారు.

కొత్తపల్లి మండలం నుంచి..

కొత్తపల్లి: సామర్లకోటలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కొత్తపల్లి మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, పార్టీ అభిమానులు భారీగా తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొన్నడ, వాకతిప్ప నుంచి భారీ ర్యాలీగా వెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి భావనారాయణరెడ్డి, సర్పంచులు పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, గుండ్ర రాజబాబు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నాగ లోవరాజు

సీఎం పర్యటన సాగిందిలా..

పెద్దాపురం/సామర్లకోట: షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం పది గంటలకు రావాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 10.37 గంటలకు పెద్దాపురం 13వ వార్డులోని లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 10.38 గంటలకు ల్యాండ్ అయిన ఆయన 10.40 సమయానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీలు మిథున్‌రెడ్డి, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, వంగా గీత, మార్గాని భరత్‌రామ్, భరత్‌గుప్తాలతో కలసి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మంత్రులు దాడిశెట్టి రాజా, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పర్వత ప్రసాద్, పెండెం దొరబాబు తదితరులతో ముఖాముఖీ భేటీ అయ్యారు. అనంతరం 10.56 గంటలకు బస్సులో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి సామర్లకోట జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల ప్రారంభోత్సవాలకు వెళ్లారు. అక్కడ నుంచి సామర్లకోట సీబీఎం కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. కలెక్టర్ కృత్తికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ ఇలాక్కియ, ఆర్డీఓ జేఎస్ రామారావుల ఆధ్వర్యంలో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు చేయగా సీఎం బహిరంగ సభ అనంతరం 1.33 గంటలకు హెలీప్యాడ్ వద్ద ఆయన ఎల్3 వద్ద వేచి ఉన్న దివ్యాంగులు, ఆరోగ్యశ్రీ రోగులతో సుమారు అరగంట పాటు మాట్లాడి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రభుత్వం నుంచి చేపట్టాల్సిన సహాయ, సహకారాలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎల్2లో వేచి ఉన్న పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలను పరిచయం చేసుకుని సెల్ఫీలు దిగారు. దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సామర్లకోట మున్సిపల్ మాజీ చైర్మన్ మన్యం పద్మావతి భర్త, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు ముఖ్యమంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో భేటీ అనంతరం 3.45 గంటలకు అమరావతి వెళ్లారు. సీఎంను కలిసినవారిలో స్థానిక నాయకులు కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, బూత్ కమిటీ రీజనల్ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి తదితరులున్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం











సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సామర్లకోట వచ్చారు. ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ పుష్పగుచ్ఛాలతో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.

ఇంటింటికీ సంక్షేమం అందాలి

- ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు
- మండల పరిషత్ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సామర్లకోట: సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువయ్యేలా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సామర్లకోటలో ముఖ్యమంత్రి పర్యటన ఉండడంతో అనేక మంది అధికారులు సమావేశానికి హాజరు కాలేదన్నారు. 90 రోజుల కాలపరిమితిలో నిర్వహించాల్సి ఉన్నందున ఈ సమావేశాన్ని నిర్వహించామని, హాజరు కాని అధికారులతో త్వరలో ఎంపీడీఓ అధ్యక్షత సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బి.ప్రశాంతి మండలంలోని 22 మహిళా సంఘాలకు ఆసరా పథకం అందలేదని, అయితే లోపాలను సవరించడంతో మూడేళ్లకు చెందిన మొత్తం ఒకేసారి వచ్చిందని తెలిపారు. మహిళా సంఘాలకు స్త్రీనిధి రుణాలు ఎందుకు అందడం లేదని ఎంపీపీ ప్రశ్నించారు. మండలంలో కొన్ని సంఘాలు స్త్రీనిధి బకాయిలు ఉండటంతో రుణాలు ఇవ్వడానికి సంస్థ ముందుకు రావడం లేదని ఏపీఎం తెలిపారు. పీబీ దేవం ఇళ్ల పట్టాలో ఉన్న లోపాలను సవరించాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత రెవెన్యూ అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

ఘనంగా పసర పండగ



వాకతిప్పలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో గురువారం పసర పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెట్టుబలిజపేటలో పూర్వ నుంచి పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు కొలువై ఉంటుందని భావించి ఏటా అక్టోబర్‌లో అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గురువారం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారి పండగ నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని వాకతిప్పలో గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో పెళ్లి విందును తలపించేలా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కుతుకుడుమిల్లి, వాకతిప్ప, కొత్తపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 25 వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం ముహూర్తపు రాట వేశారు. 64 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ తెలిపారు. సమితి నాయకులు తోటకూర వీరవెంకటసత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, నువ్వుల బాబీ, వెంకట్రాజు, తడాల దొరబాబు, మండవిల్లి శ్రీనివాసు, తోటకూర రాంబాబు, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.



ముహూర్తపు రాటకు పూజలు చేస్తున్న సేవా సమితి నాయకులు

పాదగయ క్షేత్రంలో భవానీ భక్తుల రద్దీ

పిఠాపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాది మంది భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలోని పదో శక్తి పీఠమైన పురూహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో వారం రోజులుగా భవానీ భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత రెండు రోజుల్లో సుమారు 20 వేల మంది భక్తులు భవానీ మాల ధరించారు. కాగా భవానీ దీక్షాధారణ సందర్భంగా గురువారం భారీగా భక్తులు తరలి రావడంతో పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి, పురూహూతికా అమ్మవార్లకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



భవానీ భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పిఠాపురం: బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా పిఠాపురంలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. శుక్రవారం కూడా విధులకు హాజరు కాకూడదని నిర్ణయించినట్టు పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు తెలిపారు.